ఏలూరు ప్రజలకు ఆహ్లాదం

- ఇడా నిధులతో మొక్కల కుండీలు ఏర్పాటు
- ఆర్ఎంఎస్, ఆదర్శనగర్ పార్కుల అభివృద్ధి

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించటం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఆధారిటీ (ఇడా) ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. ఆర్ఎంఎస్ కాలనీ, ఆదర్శ కాలనీల్లోని నగరపాలక పార్కుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఒక్కో పార్కు అభివృద్ధికి రూ.50 లక్షలు చొప్పున రూ.1 కోటికి పైగా ఖర్చు చేయనుంది. ఇప్పటికే పార్కుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. జూట్‌మిల్లు పై ఓవర్ బ్రిడ్జి వంతెన, పాత బస్టాండ్ నుంచి పెద్ద రైల్వేస్టేషన్‌కు వెళ్లే రైల్వే పై ఓవర్ బ్రిడ్జి, అశోక్‌నగర్ బ్రిడ్జి ఇతర ప్రాంతాల్లోనూ పూలు, మొక్కల కుండీలను ఏర్పాటు చేయనున్నారు. నగరంలో సుమారు 750 పూలు, మొక్కల కుండీలను ఏర్పాటు చేయనున్నారు. జూట్‌మిల్లు పై ఓవర్ బ్రిడ్జిపై 112 కుండీలను ఏర్పాటు చేశారు. వీటి నిత్య పర్యవేక్షణకు అధికారులు సిబ్బందిని కేటాయించారు. ఇటీవల జూట్‌మిల్లు పై ఓవర్ బ్రిడ్జిపై రెండు వైపులా భారీ పూలు, మొక్కల కుండీలను ఎమ్మెల్యే ఆళ్ల నాని రెండురోజుల క్రితం ప్రారంభించి, మొక్కలకు నీరు పోశారు.


జూట్‌మిల్లు బ్రిడ్జిపై మొక్కల కుండీలు ఏర్పాటుచేసి నీరు పోస్తున్న ఎమ్మెల్యే నాని (ఫైల్)



జూట్‌మిల్లు బ్రిడ్జిపై ఏర్పాటుచేసిన మొక్కల కుండీలు (ఫైల్)

అభివృద్ధిలో ఇడా భాగస్వామ్యం



ఏలూరు నగరాభివృద్ధిలో ఇడా భాగస్వామ్యం ఉంది. ఏలూరు జిల్లా కేంద్రమైన నగరంలో ప్రజలకు మరింత మెరుగైన రీతిలో సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆకాంక్షకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. రూ.1 కోటిపైగా నిధులతో నగరంలో రెండు పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణతోపాటు, ప్రజలకు స్వచ్ఛమైన గాలి లభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మధ్యాహ్నపు ఈశ్వరి, ఇడా చైర్‌పర్సన్, ఏలూరు

పలు ప్రాంతాల్లో పూల కుండీలు



ఏలూరు నగరంలో పలు ప్రాంతాల్లో భారీ పూలు, మొక్కల కుండీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. నగరంలో సుమారు 750 కుండీల ఏర్పాటుకు నిర్ణయించాం. ఇడా నిధులు రూ.40 లక్షలతో మొక్కలు, పూల కుండీలను ఏర్పాటు చేసి, మంచి ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని భావిస్తున్నాం. జూట్‌మిల్లు బ్రిడ్జి, పాతబస్టాండ్ సమీపంలోని రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, అశోక్‌నగర్, ఇతర ప్రాంతాల్లోనూ కుండీలు ఏర్పాటు చేయబోతున్నాం.

– డి.చంద్రశేఖర్, ఇడా వైస్ చైర్మన్

క్లుప్తంగా

ఇఫ్టూ అఖిల భారత మహాసభల కరపత్రం విడుదల


మహాసభల కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల 16, 17,1 8 తేదీల్లో తిరుపతిలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాసభల కరపత్రం గురువారం విడుదల చేశారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మహాసభల వివరాలను వెల్లడించారు. కేంద్రంలోని ప్రధాని మోదీ, అమిత్ షాల ప్రభుత్వం ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం సమరశీల ఉద్యమాలను చేపట్టాలన్నారు. పలువురు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణ స్వామి మృతి తీరని లోటు

ఏలూరు (టూటౌన్): మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి మృతి జిల్లా రాజకీయాలకు, ప్రజలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి నారాయణ స్వామి అని కొనియాడారు. నారాయణ స్వామి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు.

నేడు కలపర్రులో గడపగడపకు

పెదపాడు : మండలంలోని కలపర్రు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం నాలుగు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన పథకాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ప్రసాద్ కోరారు.

పాటెమ్మవారికి పూజలు

దెందులూరు: చల్లచింతలపూడిలోని పాటెమ్మ వారికి గురువారం విశేష పూజలు చేశారు. ఆలయ చైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ హేమలత శ్రీ పాటెమ్మ తల్లికి 20 కాసుల బంగారం, వెండితో మంగళ సూత్రం, కిరీటం, వడ్డాణం, పెద్ద ముక్కుపుడక, త్రిశూలం, నేత్రాలు తయారుచేయించి వాటితో అమ్మవారిని అలంకరించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, చైర్మన్ దంపతులు పాటెమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కార్మిక సంక్షేమ చట్టాలను అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మిక సంక్షేమం కోసం ఉన్న చట్టాలను అమలు చేయాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి కోరారు. స్థానిక అన్నే భవన్‌లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ ప్రత్యేక సంచికను గురువారం ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలో 65 శాతం మంది వ్యవసాయం ఆధారతపై జీవిస్తున్నారన్నారు. యాంత్రీకరణ పెరగడంతో పనులు కోల్పోతుతున్నట్టు చెప్పారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిధులు తగ్గించడంతో కూలీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. యంత్రాలతో పనిచేయించడం వల్ల కాంట్రాక్టర్లు జేబులు నింపుకోవడం తప్ప ఉపాధి కూలీలకు కనీస వేతనాలు అందడం లేదని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివృద్ధి, ఉపాధి హామీ, భూమి, వలస కూలీలు, మహిళా కార్మికులు, విద్యా, వైద్యం తదితర అంశాలపై గత మహాసభలో చర్చించామన్నారు. ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ మహంకాళీరావు, నాయకులు మావూరి శ్రీనివాస్, జె.మహేష్, పి.ఆనంద్ రావు, జాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో మహిళా సాధికారత

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో మహిళలు సాధికారత సాధిస్తున్నారని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. ప్రపంచ మహిళాదినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, జగనన్న చేయూత తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. ఉద్యోగ, రాజకీయ పదవుల్లో 50 శాతం మహిళలకే కేటాయించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా మండల పరిషత్, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తోన్న సుమారు 28 మంది మహిళా ఉద్యోగులకు ఆయన చీరలు బహూకరించారు. ఎంపీఈఓ బి.ప్రణవి, ఈఓపీఆర్డీ ఎం.సరళ కుమారి, ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, పీఆర్ ఏఈ కృష్ణమోహన్, ఏపీఓ కిషోర్ తదితరులు పాల్గొని మహిళ గొప్పతనాన్ని కొనియాడారు.


మహిళా ఉద్యోగికి చీర అందిస్తున్న దృశ్యం

సత్యసాయి సంస్థల సేవా కార్యక్రమాలు


కో ఆర్డినేటర్ కిరణ్‌కు జ్ఞాపిక అందిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం వివిధ సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. రామకృష్ణాపురం సత్య సాయి మందిరంలో ఉదయం ఓంకారము, సుప్రభాతం, నగర సంకీర్తన నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర మహిళా సేవా విభాగ కో ఆర్డినేటర్ కిరణ్ స్థానిక ప్రేమ సాయి ఆటో ఫైనాన్స్ సెంటర్‌లో చలివేంద్రం ప్రారంభించారు. ఈ వేసవిలో 90 రోజుల పాటు మజ్జిగ, మినరల్ వాటర్ అందించనున్నారు. ఇక్కడ గత 25 సంవత్సరాలుగా ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవా సంస్థల గౌరవ అధ్యక్షుడు కొమ్మారెడ్డి భాస్కరరావు గృహం నుంచి స్వామివారి పాదుకలు, శ్రీరామ లక్ష్మణ ఆంజనేయ స్వామి దేవత మూర్తులను రామకృష్ణాపురం సత్యసాయి మందిరం వద్ద సీతమ్మ వారున్న కల్యాణ వేదికకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. రాష్ట్ర మహిళా సేవా విభాగ కోఆర్డినేటర్ ప్రశాంతి పతాకావిష్కరణ చేశారు. సీతారాముల కల్యాణం దిట్టకవి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 200 మంది భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్య నారాయణ సేవలను రాష్ట్ర మహిళా విభాగ కోఆర్డినేటర్ సందర్శించారు. స్వామివారికి మహా మంగళహారతి, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కానుమిల్లి శశిశేఖరరావు, ఏలూరు సమితి కన్వీనర్ పైడిటి రామారావు పర్యవేక్షించారు.

కార్పొరేటర్ ఉమామహేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తివేత

ఏలూరు టౌన్: ఏలూరు 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావుపై సస్పెన్షన్ ఎత్తివేసినట్టు వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని గురువారం పేర్కొన్నారు. గత ఆరు నెలలుగా పార్టీ నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నారని, ఉమామహేశ్వరరావు ఇకపై కార్యక్రమాల్లో యథావిధిగా పాల్గొంటూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని తెలిపారు.

సీతారాముల కల్యాణం.. కమనీయం

వాడవాడలా స్వామి వారి ఊరేగింపులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భద్రాచలంలోని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం శుభ ముహూర్తానికే పలుచోట్ల స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులకు పానకం వడపప్పు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆయా ఆలయాల నుంచి స్వామి వార్ల ఊరేగింపు నిర్వహించారు. ఏలూరు 40వ డివిజన్లో ఫ్రెండ్స్ యూనిటీ సెంటర్ వద్ద శ్రీరామ మందిరం, రామచంద్రరావుపేట సుబ్బమ్మ దేవి స్కూల్ రోడ్డులోని కోదండ రామాలయం, దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రం, పవర్‌పేట బడేటి వారి వీధి కోదండ రామాలయంలలో స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల ఆధ్వర్యంలో స్థానిక అమీనాపేట విద్యుత్ రామాలయంలో 18వ వార్షిక సీతా రామ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఈపీడీసీఎల్ ఏలూరు సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు, పూర్వపు ఎస్ఈ శ్యాం బాబు, పలువురు ఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. నరసింహరావు పేట షిర్డీ సాయి మందిరంలో సీతారాముల కల్యాణం అనంతరం సాయంత్రం నాలుగు గంటల నుంచి స్వామి వారి ఊరేగింపు, రాత్రి 8 గంటలకు పవళింపు సేవ నిర్వహించారు. మందిర 32వ వార్షికోత్సవా లు ఘనంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని కోదండ రామాలయాల్లో కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

ఏలూరు మండల గ్రామాల్లో..

ఏలూరు రూరల్ : కొల్లేరు గ్రామం గుడివాకలంకలో, చాటపర్రులో నల్లగట్టు వద్ద నూతన రామాలయంలో, స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో, శనివారపుపేట, వెంకటాపురం, సత్రంపాడు, తంగెళ్లమూడి, చొదిమెళ్ల గ్రామాల్లో యువకులు పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం నిర్వహించారు. తీర్థప్రసాదంతో పాటు పానకం, వడపప్పు భక్తులకు పంపిణీ చేశారు.

పానకం సరుకుల వితరణ

ఏలూరు (టూటౌన్): శ్రీరామనవమి సందర్భంగా జిల్లాలోని 100 రామాలయాల్లో పానకం వితరణకు కావాల్సిన బెల్లం, మిరియాలు, శొంఠి వంటివి అందజేసినట్టు తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి చౌదరి తెలిపారు. గురువారం నగరంలోని తస్యనారాయణ పేటలోని శ్రీరాముడిని ఆయన దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ని రామాలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించి, మెమెంటో అందజేశారు.


సుబ్బమ్మదేవి స్కూల్ వద్ద కోదండ రామాలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


అమీనాపేట విద్యుత్ సబ్‌స్టేషన్ రామాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న అధికారులు


గాంధీనగర్ రామమందిరంలో స్వామి వారు


భక్తులకు తాళిబొట్టు చూపుతున్న అర్చకులు


తలంబ్రాలు కలుపుతున్న భక్తులు

ఘనంగా అశోక చక్రవర్తి జయంతి

ఏలూరు (టూటౌన్): మౌర్య సామ్రాజ్య మణి మకుటం, భౌద్ధధర్మ జయకేతనం సామ్రాట్ అశోక చక్రవర్తి 2,326వ జయంతి కార్యక్రమం స్థానిక ఎస్టీ ఎంప్లా యీస్ యూనియన్ కార్యాలయంలో గురువారం విభిన్న బహుజన లౌకిక వాద సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రపంచంలో 10 వేల మంది రాజుల్లో అత్యంత ప్రతిభ గల రాజు అశోక చక్రవర్తి అని గుర్తు చేశారు. దేశాన్ని 2,250 సంవత్సరాలు పాలించిన అశోకుడిని ఇప్పటికీ గుర్తు పెట్టుకున్నామంటే ఆయన పాలనలో రాజ్యం శుభిక్షంగా, ఆనందంగా ఉండటమే కారణమని చెప్పారు. బామ్సెఫ్ జిల్లా కన్వీనర్ అలుగుల సాయిరాజు, రైల్వే బహుజన సంఘం నాయకులు గుదే రాంబాబు, గరికిముక్కు వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ తక్షశిల, నలంద విద్యా సంస్థలు నెలకొల్పిన ఘనత అశోకునికే దక్కుతుందన్నారు. బామ్సెఫ్ కో కన్వీనర్ షన్ కాన్షీరామ్, ఎం వసంత్ కుమార్, దోనె రవి, బల్లం సాయిరాజు, కందుల రవి, కుంభ రాజు, చంద్రమౌళి, నాగ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అశోక్ చక్రవర్తి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సత్రంపాడు, సిద్ధార్థ, విద్యానగర్ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ తెలిపారు. సత్రంపాడు, విద్యానగర్ ప్రాంతం, ఆర్టీసీ కాలనీ, సిద్ధార్థ మెయిన్ రోడ్డు, యాదవ నగర్, టెలికాం నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడతుందన్నారు. ఎంఆర్‌టీ రిలే టెస్టింగ్ నిర్వహణ నిమిత్తం ఏలూరు వన్‌టౌన్, టూటౌన్, పవర్‌పేట, సంతోష్‌నగర్, వట్లూరు, శాంతి నగర్, శనివారపుపేట, పెదపాడు, జానంపేట పరిసర ప్రాంతాల్లో మధ్యా హ్నం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల మధ్య విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	31
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	28
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	33
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	08-10
బెండకాయలు	34	కంద	46
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-34	కీరా దోస	30
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	90
బీరకాయలు (పందిరి)	64	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	36	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	24-36	బఠాణీ	60
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

వాహన తనిఖీల్లో 1,990 కేసులు


ఏలూరులో వాహన తనిఖీ చేస్తున్న టూటౌన్ పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, నేరాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్లు, కైకలూరు సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్ల ప్రాంతాల్లోనూ మూడు రోజులపాటు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈనెల 26, 27, 29 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో 1990 చలానాలు విధించి, కేసులు నమోదు చేశారు. హెల్మెట్ ధరించని వారిపై 1,148, లైసెన్సులు లేనివారిపై 301, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై 6, మోటారు సైకిల్‌పై త్రిబుల్ రైడింగ్‌పై 51, నిర్లక్ష్యంగా, అతివేగంగా వాహనాలు నడిపేవారిపై 3, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై 34, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై 70 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ వాహన తనిఖీలు నేరస్తుల నియంత్రణ, అక్రమ రవాణాను అడ్డుకోవటానికి దోహదపడతాయన్నారు. మోటారు సైకిల్‌పై ప్రయాణించే వ్యక్తులు విధిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడతారని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై మృత్యువాత పడుతున్నారని తెలిపారు. సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని ఎస్పీ సూచించారు.

ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

ఏలూరు రూరల్: ఏలూరు మండలం చాటపర్రులోని డాక్టర్ కాంచనమాల కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ తెలిపారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హాజరౌతారని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు.